## క్లుప్తంగా

### కౌన్సిల్ సమావేశం రేపు

**రేపల్లె:** పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్ట మంగ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### విద్యార్థి చదువుకు చేయూత



**రేపల్లె:** ప్రతిభగల కాపు పేద విద్యార్థులకు కాపు డాక్టర్స్ అసోసియేషన్ చేయూతనిస్తుందని డాక్టర్ కొలసాని పృథ్వీ గణేష్ తెలిపారు. ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పట్టణానికి చెందిన దూళ్ల కార్తీక్‌కు కాపు డాక్టర్ అసోసియేషన్ సహకారంతో ఆర్థిక సహాయం అందించారు. గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రూ.25 వేల చెక్కును విద్యార్థి తల్లిదండ్రులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకిశెట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పొడిగింపు

**రేపల్లె:** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సెప్టెంబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సి.రవిచంద్రకుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో సైన్స్ విభాగంలో బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ(కెమిస్ట్రీ), బీఎస్సీ(ఫిజిక్స్), బీఎస్సీ(జువాలజీ) కోర్సులు.. బీఏ(హిస్టరీ), బీఏ(ఎకనామిక్స్), బీకామ్ (జనరల్), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులందరూ సెప్టెంబరు 1వ తేదీ వరకు జరిగే ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియలో పేర్లు నమోదు చేసుకుని అడ్మిషన్ పొందగలరని కోరారు.

### సమిత్వ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి



**చుండూరు(కొల్లూరు):** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమిత్వ సర్వేను నిర్దేశించిన గడువులోపు వేగవంతంగా పూర్తి చేయడానికి సిబ్బంది పాటుపడాలని రేపల్లె డివిజనల్ పంచాయతీ అధికారిణి పి.పద్మ అన్నారు. గురువారం మండలంలోని చినపరిమిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలలో సర్వేను నిబద్ధతతో నిర్వహించి పూర్తి సమాచారం సేకరించి ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి మేరుగ సుభాషిని పాల్గొన్నారు.


### అమరుల త్యాగాలు మరువలేనివి

**చెరుకుపల్లి:** ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడి ప్రాణాలు అర్పించిన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, సీపీఐ(ఎంఎల్) నాయకులు మరివాడ వెంకటరావులు అన్నారు. గురువారం విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణల 25వ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వామ పక్షాల పిలుపు మేరకు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాల క్రితం విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలో బషీరాబాగ్‌లో అప్పటి ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణలు అమరులయ్యారని, వారి త్యాగాలను మరువలేమని అన్నారు. తమ త్యాగాలను వృథా కానివ్వమని.. వారు చూపిన సమర మార్గంలో ముందుకు సాగుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, నాయకులు కోటేశ్వరరావు, సూర్య ప్రభావతి, పలువురు ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





భట్టిప్రోలులోని విఠలేశ్వరనగర్‌లో..



నగరం సంత బజార్‌లో గణనాథుడు



కోనేటిపురం పరిధి జంపనివారిపాలెంలో..



భట్టిప్రోలులోని చింతమోటులో గణపతి

# తొలి పూజలందుకో ఏకదంతా

వినాయక చవితి వేడుకలను భక్తులు అట్టహాసంగా నిర్వహించారు. ఇంటింటా గణపతిని పత్రి, పూలు, పండ్లతో శక్తిమేర కొలుచుకున్నారు. పిండివంటలను చేసుకుని ఇంటిల్లిపాది సంతోషంగా గడిపారు. కూడలి ప్రాంతాల్లో భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన గణపతి పందిళ్లు ఆకర్షణీయంగా నిలిచాయి. పర్యావరణ ప్రేమికులు మట్టి ప్రతిమలను ఉపయోగించి తమ భక్తి ప్రవర్తులను చాటుకున్నారు.

- వాడవాడలా గణనాథునికి పూజలు
- కనులవిందుగా విగ్రహాలు, ప్రత్యేక అలంకరణ
- విద్యుత్ కాంతులతో గణేష్ మందిరాలు



రేపలెల్లోని నేతాజీనగర్‌లో ఘనంగా పూజలందుకుంటున్న లంబోదరుడు, నమస్కరిస్తున్న యువకులు

**రేపల్లె:** వినాయక చవితి వేడుకలను నియోజకవర్గ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ, గ్రామ పురవీధుల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి విఘ్నేశ్వరుని భారీ ప్రతిమలను నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని వరసిద్ధి వినాయకుని ఆలయం, రంగా బొమ్మ సెంటరులోని వినాయకుని ఆలయంలో చవితి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తాలూకా సెంటరులో వర్తక సంఘాల ఆధ్వర్యంలో, ఓల్డ్‌టౌన్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో, అంకమ్మ చెట్టు సమీపంలో, రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలో ఆటో స్టాండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో, ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో, ఇసుకపల్లిలోని సాయిబాబా ఆలయం వద్ద, నేతాజీనగర్‌లో బాలభక్త బృందం ఆధ్వర్యంలో గణేషుని విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పేటేరు, మోళ్లగుంట, నల్లూరుపాలెం, కై తేపల్లి, మైనేనివారిపాలెం, లంకెవానిదిబ్బ, గంగడిపాలెం తదితర గ్రామాలలోనూ గణేషుని ప్రతిమలను నెలకొల్పి పూజలు చేశారు.

**నిజాంపట్నం:** మండల కేంద్రమైన నిజాంపట్నంలో, కళ్లిఫలం, కోనఫలం, అడవులదీవి, నక్షత్రనగర్, కొత్తపాలెం, కూచినపూడి తదితర గ్రామాల్లో చవితి వేడుకలను నిర్వహించారు.

**రేపల్లె:** పట్టణం, మండలంలో ఏర్పాటు చేసిన పలు చవితి వేడుకల్లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కమతం సాంబశివరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రేపల్లె పట్టణం ఓల్డ్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి.. 10వ వార్డు, మండలంలోని పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు.

**వాడవాడలా చవితి వేడుకలు..**

**కర్లపాలెం:** మండలంలోని గ్రామాల్లో చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గణేషుని విగ్రహాలకు నూతన వస్త్రాలు ధరింపజేసి పలు రకాల పూలమాలలతో అలంకరించారు. నిమ్మ, బత్తాయి, దండలు గణేషునుకి అలంకరించారు. పలు రకాల పూలతో ఆపిల్, సీతాఫలం, దానిమ్మ, మొక్కజొన్న కంకెలు, పత్రితో స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, అటుకులు, బెల్లం, నైవేద్యాలను సమర్పించారు.

**భట్టిప్రోలు:** వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని 15 గ్రామాల్లో ఈ ఏడాది 65 విగ్రహాలను ఏర్పాటు చేశారని ఎస్ఐ ఎం.శివయ్య తెలిపారు. భట్టిప్రోలు విఠలేశ్వరనగర్, కొత్తపేట, వెల్లటూరు, కట్లమ్మ తల్లి దేవాలయం, ఐలవరం చైర్మన్ బజార్, అద్దేపల్లి, చింతమోటు, జంపనివారిపాలెం తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**నగరం:** వినాయక చవితి పర్వదిన వేడుకలను మండలంలోని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఇంట్లో ఏర్పాటు చేసిన మట్టి గణనాథులకు విశేష పూజలు చేశారు. ఈదుపల్లి, చిరకాలవారిపాలెం, భట్టువారిపాలెం, ధూళిపూడి, కొలగానివారిపాలెం, పెద్దవరం, పెదమట్లపూడి, తాడివాకవారిపాలెం గ్రామాల్లో ఏకదంతుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

**కొల్లూరు:** కొల్లూరు మండలంలో చవితి వేడుకలను అత్యంత వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని మండపాలు విద్యుత్తు దీపాల వెలుగులతో కళకళలాడాయి. మండలంలో అధికారికంగా 58 వినాయక మండపాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. కొల్లూరు మసీదు వద్ద మతసామరస్యానికి ప్రతీకగా వినాయకుడి విగ్రహంను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు.

**ఘనంగా గణేష హోమం..**

**చుండూరు(కొల్లూరు):** వినాయక ఉత్సవాలలో భాగంగా మండలంలోని చినపరిమిలో గణేష హోమం అత్యంత ఘనంగా నిర్వహించారు. గురువారం రెండోరోజు గణేష మండపంలో జరిపిన హోమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి పూజా కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు.

### గణనాథునికి ప్రత్యేక పూజలు..



గుళ్లపల్లి ఈఎస్ఆర్ నగర్ వేడుకల్లో డాక్టర్ ఈవూరు గణేష్

**చెరుకుపల్లి:** మండలంలోని గ్రామాల్లో గణనాథుడు కొలువుదీరాడు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ గుళ్లపల్లి ఈఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చినపరిమిలో గణేష హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



కర్లపాలెం పాపిరెడ్డిపాలెంలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు



కొల్లూరు లాక్‌సెంటర్ వద్ద..

### ఆశా వర్కర్ల హామీలను నెరవేర్చాలి



**బాపట్ల:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లిస్తామని ఎన్నికల హామీల్లో తెలిపారని.. నేటికీ తమ వేతనాలపై మాట్లాడడం లేదని ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) సంఘం రాష్ట్ర కోశాధికారి ఎ.కమల అన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ద్వితీయ మహా సభలో ఆమె మాట్లాడారు. ఆశా వర్కర్లు పని చేయడానికి నాణ్యమైన ఫోన్‌లు ఇవ్వడంలేదన్నారు. పెరిగిన పని భారానికి తగిన విధంగా వేతనాలను పెంచాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్.మణిలాల్, జిల్లా కార్యదర్శి సీహెచ్.మజుందార్‌లు మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలందించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. తొలుత బాపట్ల జిల్లా కార్యాలయంలో సీఐటీయూ పతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్మిక రంగంలో మరణించిన మృతులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షులు డి.ధనలక్ష్మి, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరమ్మ, నాయకులు కృష్ణవేణి, ఎం.రాజకుమారి, బి.ఝాన్సీ లక్ష్మి, ధనమ్మ, వాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**ఏపీసీపీడీసీఎల్ ఇన్‌చార్జి ఏఈ శాంతకుమారి**

**భట్టిప్రోలు:** విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఏపీసీపీడీసీఎల్ భట్టిప్రోలు ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎం.శాంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వైర్ల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో విద్యుత్ సిబ్బంది సహకారం తీసుకోవాలని అన్నారు. వర్షాలకు చెట్లు, స్తంభాలు పడిపోతే సిబ్బంది తక్షణమే మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన మోటార్లను ఆన్ చేయవద్దని.. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని.. వ్యవసాయ పంప్‌సెట్లు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలని కోరారు. ఎల్‌సీ తీసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు వంటివి చేయకూడదని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### సాధన మండలిలో రుషి పంచమి వేడుకలు



**భట్టిప్రోలు:** భాద్రపద శుద్ధ పంచమినాడు మహా రుషులను గౌరవించి, పూజించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో గురువారం రుషి పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యజ్ఞయాగాదులను నిర్వహించి మనకు మార్గ దర్శకులైన రుషులను సన్మానించడం మన ధర్మమన్నారు. దేవ రుణం, పితృ రుణం, రుషి రుణం తీర్చుకోవడం పుణ్యప్రదమన్నారు. ఆధ్యాత్మికవేత్తలైన వశిష్ఠ, విశ్వామిత్ర, జమదగ్ని, భరద్వాజ, గౌతముడు, అత్రి, కాశ్యపుడు అనే సప్త రుషులను ఈఎల్‌వీ అప్పారావు, చుండూరు రామమోహనరావు, యలవర్తి రాంబాబు, పొన్నం విజయ్ కుమార్ (తెనాలి), నోరి కోదండ రామయ్య (గుంటూరు), భోజనపల్లి లక్ష్మి నరసింహ వరప్రసాద్ (మంగళగిరి), దుంపా ప్రసాదరావు (కనగాల)లుగా భావించి పూజించారు. తొలుత సప్త రుషులు యజ్ఞం చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, కమిటీ సభ్యులు, పర్యవేక్షించారు.

## పండుగ మిగిల్చిన విషాదం!



శ్రీమంత్ మృతదేహం వద్ద విలపిస్తున్న అమ్మమ్మ సాంబ్రాజ్యం

- కలువపూల కోసం చెరువులో దిగి ఇద్దరు గల్లంతు
- మృత్యువు ఒడికి చేరిన బాలురులు



నాగభూషణం మృతదేహం వద్ద తల్లిదండ్రులు, బంధువులు

**బాపట్ల టౌన్:** కలువపూలు కోసం చెరువులో దిగి ఇద్దరు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన బుధవారం మండలంలోని పూండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వినాయక చవితి వేడుకల్లో భాగంగా పూండ్ల గ్రామానికి చెందిన సైకం నాగభూషణం (17), సుద్దపల్లి శ్రీమంత్(15), స్నేహితుడు డి.చందుతో కలిసి గ్రామశివారులోని రమణప్పపాలెం చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో కలువపూలు కోయడానికి దిగిన నాగభూషణం తూడికాడలో ఇరుక్కుపోయాడు. రక్షించేందుకు వెళ్లిన శ్రీమంత్ నాగభూషణంతో సహా గల్లంతయ్యాడు. చందు కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఇద్దరు బాలురులు మృత్యువు ఒడికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ నాడు విషాద ఛాయలు అలుముకున్నాయి.

## హెచ్ఐవీ నియంత్రణలో విద్యార్థుల పాత్ర కీలకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్

**కొల్లూరు:** హెచ్ఐవీ నియంత్రణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించి ప్రజలలో అవగాహన కల్పించాలని ఐసీటీసీ కౌన్సిలర్ పేరమ్మ అన్నారు. గురువారం వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, సిరి మహిళా సాధికారిక వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కౌమార దశ నుంచి ఎయిడ్స్ వ్యాధి నివారణ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండి సమాజంలో హెచ్ఐవీ నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టు మేనేజర్ రవీంద్ర, ఎస్ఎంఎస్‌డబ్ల్యూఎస్ ఓఆర్‌డబ్ల్యూఎస్‌లు జి.సునీత, జె.రాజు, డి.కమల్‌హాసన్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### తెలుగు అకాడమీ శాఖలను ఏర్పాటు చేయాలి

**బాపట్ల:** సుదీర్ఘ పోరాటాల అనంతరం తెలుగుకు ప్రాచీన భాష హోదా దక్కినప్పటికీ ఆ గౌరవాన్ని నిలుపుకోవడం క్లిష్టతరంగా మారిందని.. ఆంగ్ల భాషపై వ్యామోహమే అందుకు ప్రధాన కారణమని బాపట్ల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, రచయిత తిమ్మన శ్యామ్ సుందర్ అన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించేందుకు దోహదపడిన తెలుగు భాష మనుగడ ప్రశ్నార్థకంగా మారకముందే భాషాభిమానాన్ని పెంపొందించేందుకు క్షేత్రస్థాయిలో కృషి జరగాలని ఆయన కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలోనూ తెలుగు అకాడమీ శాఖలను ఏర్పాటు చేసి మాతృభాష ఆవశ్యకత పట్ల అవగాహన కల్పిస్తే ఈ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందన్నారు. తెలుగు తల్లికి జన్మస్థానమైన బాపట్లలో అకాడమీ తొలి శాఖను ఏర్పరచాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

**తెనాలి:** పట్టణ మారీసుపేటలోని ఎరువుల షాపులపై అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలను చేపట్టారు. ఎరువుల దుకాణాల్లోని స్టాక్‌ను, గోడౌన్లలోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. మండలంలో ఎరువుల కొరత లేదన్నారు. రైతులకు అవసరమైన డీఏపీ, యూరియా పుష్కలంగా ఉన్నట్లు తెలిపారు. త్రీ టౌన్ సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ.. వ్యాపారులు ఎవరైనా ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరకన్నా ఎక్కువగా అమ్మితే వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు ఎరువులను అధిక ధరలకు అమ్మినట్లు తెలిస్తే సంబంధిత వ్యాపారి లైసెన్సును రద్దు చేయనున్నట్లు చెప్పారు.

### జాతీయ నేత్రదాన పక్షోత్సవం

**తెనాలి:** సామాజిక సేవా సంస్థ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను గురువారం స్థానిక కొత్తపేటలోని శ్రీరావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలులో నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా నేత్ర పరీక్షలు చేశారు. అనంతరం నేత్ర సంరక్షణ, నేత్రదానంపై వారికి అవగాహన కల్పించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ పి.భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.భారతి.. విజ్ఞాన వేదిక తరఫున ఉప్పల సాంబశివరావు, నండూరి నారాయణ రావు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ప్రధానోపాధ్యాయిని భారతిని విజ్ఞాన వేదిక ప్రతినిధులు సత్కరించారు.